క్లుప్తంగా

రేపు తాగునీటి సరఫరాలో పాక్షిక అంతరాయం

నెహ్రూ నగర్: తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో 42 ఎంఎల్‌డీ ఫిల్టరేషన్ ప్లాంట్ వార్షిక మరమ్మతుల నిమిత్తం 21వ తేదీన తాగునీటి సరఫరా నిలుపుదల చేయుట జరుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఈ సుందర రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు గుంటూరు నగరంలోని బి.ఆర్.స్టేడియం, ఐ.పి.డి. కాలనీ, శ్రీనివాసరావు పేట, నల్లచెరువు, తారకరామా నగర్, ఆటోనగర్ ప్రాంతాలలో తాగు నీటి సరఫరాకు పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. నగర ప్రజలు గుంటూరు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

సీపీఎస్ రద్దు చేయాలి

గుంటూరు వెస్ట్: 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో నిరసన కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పద్మావతి, హేమలత, సుమిత్రా దేవి,నాగరాజు, మురళి పాల్గొన్నారు.

శివాజీ మహరాజ్ జయంతి



గుంటూరు మెడికల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా సోమవారం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో శోభయాత్ర నిర్వహించారు. ర్యాలీ మార్కెట్ సెంటర్ హిందూ హైస్కూల్ వద్ద ప్రారంభమై కొరిటెపాడు పార్కులోని శివాజీ మహరాజ్ విగ్రహం వరకు కొనసాగింది. కార్యక్రమంలో తులసి యోగేష్, స్వతంత్ర భారత రమేష్, చెరుకూరి శ్రీహరి, ముప్పలూరి నాగేశ్వరరావు, ఎ.దుర్గాబాబు హాజరై ఛత్రపతి శివాజీ చేసిన సేవలను కీర్తించారు. శోభయాత్రలో ఎస్.వీ రయ్యాచౌదరి, భజరంగ్ రామకృష్ణ, రామోహన్, సాయిరాధాకృష్ణ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గుంటూరు ఈస్ట్: మద్యం బాటిళ్లు తరలిస్తున్న ప్రభుత్వ వైన్‌షాపు సూపర్‌వైజర్‌పై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చల్లావారిపాలెంకు చెందిన లక్కిరెడ్డి శివరామకృష్ణ నగరంలోని కంకరగుంట సమీపంలోని ప్రభుత్వ వైన్‌షాపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. షాపులోని మద్యం బాటిళ్లను అక్రమంగా ఇంటికి తరలించి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం రామకృష్ణారెడ్డి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 133 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంవీఆర్‌కే ముత్యాలుకు సతీ వియోగం



గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీమాజేటి గురవయ్య విద్యాసంస్థల అధినేత మాజేటి ఎంవీఆర్‌కే ముత్యాలు సతీమణి ఆండాళ్ తాయారు(79) ఆదివారం రాత్రి అనారోగ్యంతో అరండల్‌పేటలోని తమ నివాసంలో కన్నుమూశారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, ఎనిమిది మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ సోమవారం బ్రాడీపేటలోని డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సంతాప సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బోసుబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయలక్ష్మి, హైస్కూల్ హెచ్ఎం శారద నివాళులర్పించారు.

రేపు సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు ప్రొఫైలింగ్ క్యాంప్

నెహ్రూ నగర్: మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు ఈ నెల 21వ తేదీన ప్రొఫైలింగ్ క్యాంప్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పరిధిలో ఉన్న మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులను గుర్తించి కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా, సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న నేషనల్ ఏక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టమ్ (నమస్తే) పథకంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రొఫైలింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఆధార్, గుర్తింపు కార్డులతో క్యాంప్‌నకు హాజరు కావాలని సూచించారు.

నేడు లైసెన్స్ హక్కుల వేలం

పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో 2024 -2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ లైసెన్స్ హక్కులకు రెండవ విడత మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. శివాలయంలో ఉదయం 11 గంటల నుంచి ఈ- టెండరు, సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త నూరిఫాతిమా

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గంలోని నాలుగో డివిజన్‌లో కార్పొరేటర్ మెహమూద్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు 98 శాతం పూర్తి చేశామని తెలిపారు. శివారు కాలనీల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ విభేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరం కలిసి కట్టుగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ జెండా మోసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో తూర్పు నియోజకవర్గాన్ని గెలిపించే దిశగా పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కర్నూమా, శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, కొండారెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి, మహేష్, సుబ్బులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల పట్టాలపై శాశ్వత హక్కు

పట్నంబజారు: పక్కా నివాసాలపై పేదలకు శాశ్వత హక్కు కల్పిస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ నియోజకవర్గంలో జోరుగా సాగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా చెప్పారు. ఈమేరకు సోమవారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని సచివాలయాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లోనే లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, మ్యాపింగ్ పూర్తయిన మేరకు ఇప్పటికే 70 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి కాగా, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ సారథి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, తూర్పు నియోజకవర్గం తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదల కలను సాకారం చేస్తూ సీఎం వై.ఎస్.జగన్ రికార్డు స్థాయిలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంతోపాటు, శాశ్వత హక్కు కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో 15, 54, 56, 57 డివిజన్ల కార్పొరేటర్లు రామనబోయిన అజయ్‌యాదవ్, అగ్గిపెట్టి కనకదుర్గ, మల్లవరపు రమ్య, పఠాన్ రిహానా పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన..

ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆటోనగర్ వై జంక్షన్ వరకు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా రూ.3 కోట్ల వ్యయంతో రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ఉ.సా. ఆశయాలను కొనసాగించాలి



ఉ.సా. చిత్రపటం వద్ద నివాళి

నెహ్రూనగర్: ఉద్యమాల ఉపాధ్యాయుడు ఉప్పుమావులూరి సాంబశివరావు(ఉ.సా) ఆశయాలను కొనసాగించాలని పలువురు బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఉ.సా. జయంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాడికొండ నరసింహారావు మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం కోసం ఎనలేని కృషి చేసి అమరులయ్యారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల వారికి ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ కేంద్ర కన్వీనర్ వై కోటేశ్వరరావు(వైకె), పాగళ్ల ప్రకాష్, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉ.సా. జయంతి సభను యానాదికాలనీలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన సంఘాల నాయకులు జీఆర్ భగత్‌సింగ్, పీవీ రమణయ్య, సీహెచ్ వాసు, సత్యనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ఎన్‌ఎస్‌ఎస్ సేవలు విస్తృతం కావాలి



సుధీర్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న రవిశంకర్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశాభివృద్ధికి ఎన్ఎస్ఎస్ సేవలు మరింతగా విస్తృతం కావాలని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తూ, ఏడాది కాలంగా గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారిగా సేవలందిస్తున్న డాక్టర్ జీవీ సుధీర్‌కుమార్‌ను మరో ఏడాది పాటు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారిగా పొడిగిస్తూ ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు డాక్టర్ రవి శంకర్ తెలిపారు. సోమవారం ఏఎన్‌యూలో రవిశంకర్ రెడ్డి నుంచి డాక్టర్ సుధీర్ కుమార్ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. సుధీర్‌కుమార్ చేసిన సేవలకు గుర్తింపుగా మరో ఏడాది కాలం పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా వీసీ రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రవిశంకర్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పేదలకు సాగుభూమి పంపిణీ చేయాలి



సమావేశాల్లో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పాత గుంటూరు: గ్రామీణ ప్రాంతంలో భూమి లేని ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకరాల సాగు భూమిని పంపిణీ చేసి, కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ మీద రుణాలు ఇప్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.కోటేశ్వరరావు కోరారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. సభకు రెంటాల కుమారి అధ్యక్షత వహించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు మహిళలు అందరినీ సమీకరించి చైతన్యపరిచి గ్రామ సంఘాలుగా ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యవసాయ కార్మికుల అభ్యున్నతి కొరకు సంఘం కృషి చేస్తుందని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్ రూ.4 లక్షల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుర్రంకొండ సత్యానందం, తన్నీరు ప్రభుదాసు, కంభంపాటి దయ, నూతక్కి శ్రీను, మదీనా బాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సోమసుందరేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ



అలంకరణలో సోమసుందరేశ్వరస్వామి

గుంటూరు ఈస్ట్: అరండల్‌పేటలోని శ్రీగంగా మీనాక్షి సోమసుందర స్వామి దేవాలయం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు రెండో రోజుకు చేరాయి. గోపూజ, దేవాలయ ప్రదక్షిణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమశాలలో గణపతి హోమం, వేదోక్తంగా చేశారు. ఉపాలయాల్లో మూర్తులకు అభిషేకాలు కనులపండువగా నిర్వహించారు. మండప పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి భాస్కరశర్మ మాట్లాడుతూ 20వ తేదీ నవ చండీపారాయణ, చండీహోమం, సామూహిక లలిత సహస్రనామ పారాయణం జరుగుతాయని పేర్కొన్నారు. 21న మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, బిల్వార్చన చేస్తారన్నారు. మండ పూజలు నిర్వహిస్తారని చెప్పారు. 22న రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం శాంతి కల్యాణం వైభవంగా జరుగుతోందన్నారు. 23న స్వామివారు, అమ్మవార్లకు నందివాహన సేవ, అన్న ప్రసాద వితరణ జరుగతాయని చెప్పారు. భక్తులకు పాల్గొని స్వామివారు, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

ముగిసిన శ్రీ విజయ గణపతి స్వామి బ్రహ్మోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీ శ్రీ విజయ గణపతి స్వామి నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం విజయ గణపతి స్వామికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, నిత్య హోమం, లక్ష్మీ సుదర్శన హోమం, మహా శాంతి హోమం, బలిహరణ, చూర్ణోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేద పండితులు పరాశరం కృష్ణ ప్రసాద్ నిర్వహించారు. అనంతరం వట్టికూటి పూర్ణచంద్రరావు, పద్మశ్రీ దంపతుల సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ అధ్యక్షులు పావులూరి కిషోర్, కార్యదర్శి నల్లమోతు వెంకట రత్తయ్య, కోశాధికారి డాక్టర్ పుచ్చ వెంకటమల్లేశ్వర్ పర్యవేక్షించారు.

నేడు ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సదస్సు మంగళవారం నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్, అంబేడ్కర్ చైర్ విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్ తెలిపారు. 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచన విధానం ఆర్థిక అభివృద్ధి దేశ నిర్మాణం' అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ హాజరవుతారని, సఫాయి కర్మచారి ఆందోళన్ కన్వీనర్ బెజవాడ విల్సన్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూపరాణి హాజరవుతారని తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు ప్రాధాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) రాష్ట్ర కార్యవర్గంలో గుంటూరు జిల్లాకు ప్రాధాన్యం లభించినట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశంలో భాగంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వి. ప్రసాదరావు, కె.జోజప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

తాగునీటి సరఫరాపై చర్చ


లక్ష్మీపురం: స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గుంటూరులో తాగునీటి సరఫరాపై సోమవారం చర్చ నిర్వహించారు. సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని చెప్పారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్.వి సింగరయ్య మాట్లాడారు. అదే విధంగా పార్లమెంట్ సంప్రదాయాలపై నిర్వహించిన చర్చలో విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల వీఎస్ ప్రసాదరావు, విద్యావేత్తలు ఆర్.రామచంద్రరావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం, ఓంకార క్షేత్రం కార్యదర్శి నంబూరు వెంకట శ్రీమన్నారాయణ మూర్తి ఆధ్వర్యంలో 90వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం నగర సంకీర్తన, నిత్యపూజలు విశేషంగా నిర్వహించారు. పద్మావతీ, ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం రుత్వికుల వేదమంత్రాల నడుమ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు. పద్మనాభ శర్మ చేసిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది.

ఆర్వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



రమేష్

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు వారి లక్ష్యసాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకుడు సాధినేని రమేష్‌బాబుకు బెళగానికి చెందిన విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. ఏ మినిమైచరైజెడ్ హెల్తీ ఐసోలేటెడ్ ఫిల్టరింగ్ అల్ట్రా వైట్ బ్యాండ్ రీకాన్ఫిగరేబల్ మైమో యాంటెన్నా ఫర్ వైర్ లెస్ అప్లికేషన్స్ అనే అంశంపై చార్య పీ దినేష్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ, డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టి.రంగబాబులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆటో డ్రైవర్లకు సమస్యలు రానీయొద్దు

- చలానాల విషయంలో నిబంధనలు పాటించాలి
- పోలీసు, రోడ్డు రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయండి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



డ్రైవర్లతో మాట్లాడుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: ఆటో డ్రైవర్లకు ఎలాంటి సమస్యలు రానీకుండా చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. స్థానిక చంద్రమౌళినగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం మంత్రి ఆటో డ్రైవర్ల సమస్యలపై రోడ్డు రవాణాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. మంత్రి రజిని మాట్లాడుతూ పాత చలానాల చెల్లింపు విషయంలో గడువు ఇవ్వాలని కోరారు. సిగ్నల్ వైలేషన్ విషయంలో నిబంధనలు అనుసరించాలని, చిన్న చిన్న వాటికి కూడా జరిమానాలు విధించే పరిస్థితులు లేకుండా చూడాలని సూచించారు. పోలీసు, రోడ్డు రవాణాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఆటో డ్రైవర్ల విషయంలో అనవసరపు ఇబ్బందులు రాకుండా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మురళీ శ్రీనివాస్, శ్రీను, లాలూ నాయక్, మురళీ, కొండలు, శివకోటిరెడ్డి, రవి, అరుణ్, పాల్గొన్నారు.

వ్యాస రచనలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీసత్యసాయి విద్యాసంస్థలు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గుంటూరు చలమయ్య- కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవత్వాన్ని పెంపొందించు విద్య ఆవశ్యకత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో బీఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని వి.పూజిత రాష్ట్ర స్థాయి, బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థిని షేక్ సుహానా జిల్లా స్థాయితో పాటు ఇంటర్ విభాగంలో ప్రథమ సంవత్సర విద్యార్థిని కె.శిరీషా చిన్మయి రాష్ట్రస్థాయిలో బహుమతులు గెలుపొందారని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణప్రభు మాట్లాడుతూ విద్యార్థులతు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే జీవితంలో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్, ప్లేస్‌మెంట్ అధికారులు ఏ శ్రీధర్, చంద్రశేఖర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ మధుసూదన్ పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదులు పరిష్కరించాలి

డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డెప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

నెహ్రూనగర్: స్పందనలో అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం జరిగేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు చొరవ చూపాలని నగర డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ ఆదేశించారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో డెప్యూటీ కమిషనర్ స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని కోరారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియచేయాలని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ముందు తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలని కోరారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 36 ఫిర్యాదులు అందగా వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 10, ఇంజినీరింగ్ విభాగానికి 14, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపాసెల్ విభాగానికి 7, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ(ఎఫ్ఏసీ) సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, ఎంహెచ్ఓ(ఎఫ్ఏసి) మధుసూదన్, ఉపాసెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్సతో బ్రెయిన్ ట్యూమర్ తొలగింపు

- సకాలంలో స్పందించి ట్యూమర్ తొలగించిన వైద్యులు
- రోగికి సంజీవనిగా మారిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం



ఆపరేషన్ అనంతరం మణికంఠతో వైద్యులు

గుంటూరు మెడికల్: బ్రెయిన్‌లో ట్యూమర్‌తో బాధపడుతూ అపస్మారక స్థితిలో చికిత్స కోసం వచ్చిన ఓ యువకుడికి అత్యంత అరుదైన శస్త్రచికిత్స చేసి వైద్యులు ప్రాణాలు కాపాడారు. రోగి మెలుకువగా ఉండగానే 'అవేక్ బ్రెయిన్ సర్జరీ' చేసి అరుదైన రికార్డు సృష్టించారు. యువకుడికి ఎంతో ఇష్టమైన శ్రీరాముడి అయోధ్య విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని ల్యాప్‌టాప్‌లో చూపిస్తూ రోగి బ్రెయిన్ నుంచి కణితిని తొలగించి నూతన జీవితాన్ని ప్రసాదించారు. బాహుబలి సర్జన్‌గా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ భవనం హనుమ శ్రీనివాస రెడ్డి సోమవారం గుంటూరు అరండల్‌పేటలోని సాయి హాస్పటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో అరుదైన ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామానికి చెందిన దానబోయిన మణికంఠ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు.ఆయనకు కొంత కాలంగా ఫిట్స్ వస్తుంది. మూర్ఛవల్ల అతను తన ఆటోను సక్రమంగా నడపలేక జీవనం అస్తవ్యస్తంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు అతడికి గుంటూరు, హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫిట్స్ తగ్గలేదు. గతేడాది డిసెంబరు 29న తీవ్రంగా ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చికిత్స కోసం తమ వద్దకు వచ్చారని బ్రింద న్యూరో సెంటర్ చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి చెప్పారు. వైద్య పరీక్షలు చేసి మెదడులో కుడివైపు కుడిచెయ్యి, గొంతు, నాలుక, దంతాలు, దవడ, మాటలు వచ్చే భాగం, ముఖానికి నరాలు సరఫరా చేసే మెదడులోని భాగంలో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించామన్నారు. జీన్స్‌లో తేడా వల్ల ఇలాంటి ట్యూమర్లు బ్రెయిన్‌లో వస్తాయని, సకాలంలో ఆపరేషన్ చేసి తొలగించని పక్షంలో యువకుడు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఆపరేషన్ చేసే సమయంలో సైతం ఏమాత్రం తేడా వచ్చినా కాలు, చెయ్యి పడిపోవడంతో పాటు మాట కూడా పడిపోతుందని గుర్తించామన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రోగి మెలుకువలో ఉండగానే అవేక్ బ్రెయిన్ సర్జరీ చేయాలని నిర్ధారించామన్నారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో యువకుడికి ఎంతో ఇష్టమైన అయోధ్య బలరాముడి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని ల్యాప్‌టాప్‌లో చూపిస్తూ ఈ నెల 11న సుమారు రెండు గంటల సేపు రోగి మెలుకువగా ఉండగానే ఆపరేషన్ చేశామన్నారు. యువకుడి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సుమారు రూ.5 లక్షల ఖరీదు చేసే అరుదైన ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో తనతో పాటుగా మత్తు వైద్య నిపుణులు డాక్టర్ త్రినాథ్, న్యూరో సర్జన్ డాక్టర్ ఆకాష్, వైద్య సిబ్బంది శ్రీను, నరేంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నట్లు వెల్లడించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేయించుకున్నానని, నూతన జీవితాన్ని ప్రసాదించిన వైద్యులకు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రోగి దానబోయిన మణికంఠ కృతజ్ఞతలు తెలిపాడు.